క్లుప్తంగా

ఆధునిక పద్ధతులు అవలంబించాలి



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు

చంద్రుగొండ: ఆధునికత పద్ధంతులు పాటించి పంటల సేద్యం చేయాలని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ నవీన్ కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని సీతాయిగూడెంలో గ్రామంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ.. రైతులు పలు సూచనలు చేశారు. రసాయనిక ఎరువుల తోపాటు యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. అధికంగా యూరియ వాడకంతో నేలతల్లి ఆరోగ్యం చెడిపోతుందన్నారు. రైతులు తాము సేద్యం చేస్తున్న పంటల్లో సవాళ్ళను వ్యవసాయ శాఖాధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఏఓ వినయ్, ఏఈఓ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో హక్కులకు భంగం

చంద్రుగొండ: లేబర్ కోడ్‌లు అమల్లో వస్తే అనేక త్యాగాలతో సాధించుకున్న కార్మికుల హక్కులు హరించుకుపోతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. మండలకేంద్రం చంద్రుగొండలోని ఆరోగ్యకేంద్రంలో ఆశవర్కర్లతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఆశవర్కర్ల సేవలను వినియోగించుకుంటున్న పాలకులు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో ఆశవర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు జనగాం రుక్మిణి, సీఐటీయూ మండల కన్వీనర్ రామడుగు వెంకటాచారి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని మద్దికొండ, కన్నాయిగూడెం పంచాయతీల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ ఆధ్వర్యంలో రైతుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్, ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, సీనియర్ అసిస్టెంట్‌లు లక్ష్మణ్, చైతన్య, సిబ్బంది రమేష్, వెంకన్న, రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉ షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శివరామ నర్సింహమూర్తి కుటుంబ సభ్యులు సుబ్రహ్మణ్యశాస్త్రి జ్ఞాపకార్థం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వీకరించారు. అనంతరం అన్నదాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామదేవస్థానం ఆలయ హుండీని నేడు లెక్కించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏజెన్సీలో ‘రియల్’ దందా

- ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే వ్యవసాయ భూముల్లో వెంచర్లు
- ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా అమ్మకం
- మామూళ్ల మత్తులో అధికారులు



మణుగూరురూరల్: పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరులో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డదారిన అక్రమంగా దోచుకుంటున్నారు. గిరిజనులు సాగు చేసుకునే ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఆయా భూముల్లో అనుమతులు లేని వెంచర్లు వేస్తున్నారు. ఏజెన్సీ ఏరియాలో ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా భూములను కొనుగోలు చేయడమే కాకుండా అక్రమ వెంచర్లతో రియల్ ఎస్టేట్ దందా సాగిస్తూ కోట్ల రూపాయల్లో దండుకుంటున్నారు.

ఏజెన్సీ చట్టాలకు తూట్లు

ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరులోని ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేని రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడి భూములు ప్రభుత్వానికి చెందినప్పటికీ గిరిజనులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. అయితే మణుగూరు పూర్తి ఏజెన్సీ ప్రాంతం కావడంతో 1/70, పీసా వంటి చట్టాల ప్రకారం ఈ భూముల క్రయవిక్రయాలకు అనుమతి లేదు. ఇందులో భాగంగా ల్యాండ్ కన్వర్షన్, లేఅవుట్లకు ఇక్కడి గ్రామపంచాయతీల నుంచి అనుమతులు ఉండవు. అయినా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు వెంచర్లు వేస్తున్నారు. ఇందుకోసం రెవెన్యూ, గ్రామపంచాయతీ వారికి ముడుపులు చెల్లిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

అధిక ధరలకు అమ్మకం

గిరిజనుల ఆధీనంలోని ప్రభుత్వ భూములను నామమాత్రపు ధరలకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు రియల్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఎకరం రూ.15 లక్షలు నుంచి రూ.20 లక్షల లోపు కొనుగోలు చేసి వాటిని రూ.50లక్షలు, అపై బడి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మణుగూరులో ప్రస్తుతం సెంట్ భూమి రూ1.50 లక్షల నుండి విక్రయిస్తుండగా... పట్టణ ప్రధాన రహదారి వెంబడి అయితే అదే సెంట్ భూమి రూ.3లక్షల పైబడి విక్రయిస్తున్నారు. అయితే ఈ విక్రయాలకు ఎటువంటి అనుమతులూ లేనప్పటికీ అమ్మకాలు చేయడం గమనార్హం.

ఇద్దరు ప్రముఖుల హస్తం?

మణుగూరు మండలంలో రియల్ ఎస్టేట్ అక్రమాల్లో ఇద్దరు ప్రముఖ వ్యాపారుల హస్తం ఉందని గట్టి వాదన వినబడుతోంది. ఆ ఇద్దరి కనుసన్నల్లోనే ప్రభుత్వ భూముల కొనుగోలు తిరిగి అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఎటువంటి అనుమతులు లేకుండా వీరు గత కొన్నేండ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందాన సాగిస్తున్నారు. వీరు కొనుగోలు చేసిన భూములన్నీ వివాదాస్పద, ప్రభుత్వ, గిరిజనుల సాగులో ఉన్న వ్యవసాయ భూములు కావడం విశేషం. గిరిజన చట్టాలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ రియల్ ఎస్టేట్ దందాను జిల్లా కలెక్టర్ అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య కేంద్రం సందర్శన



మందుల నిల్వలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి

చంద్రుగొండ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. మండలకేంద్రం చంద్రుగొండలోని ఆరోగ్యకేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో జరుగుతున్న ఆశవర్కర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వ్యాధినిర్ధారణ పరీక్షలు, రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. మందుల నిల్వలను పరిశీలించారు. రాబోవు వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదముంటుందని ఆ దిశగా గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్లు కనకం తనుజ, వెంకటప్రకాష్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘు నాయికులు

ములకలపల్లి: మార్కెట్ జోరుగా సాగుతున్న నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా నాయకుడు నూపా భాస్కర్, అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) జిల్లా నాయకులు కల్లూరి కిషోర్, నకిరకంటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐయూకేఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై విత్తనాల తోపాటు ఎరువులు, పురుగు మందులు అందించాలని అన్నారు. సంఘ మండల కార్యదర్శి ఎర్ర గొర్ల రామారావు, మడకం ఎర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల పనులు పరిశీలన



పరిశీలిస్తున్న అధికారుల బృందం..

అశ్వారావుపేటరూరల్: జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామి పథకం కింద నిర్మించిన ఇంకుడు గుంతల నిర్మాణాలను గురువారం సెంట్రల్ వాటర్ కమిషన్, సబ్ డివిజన్ ఇంజనీర్, డీఆర్‌డీఓ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ మేరకు వారు మండలంలోని మద్దికొండ, ఊట్లపల్లి, వినాయకపురం, నారాయణపురం, రామన్నగూడెం గ్రామ పంచాయతీలతోపాటు అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఇళ్ల వద్ద నిర్మించుకున్న ఇంకుడు గుంతలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ కార్యాలయ సిబ్బంది ఎంవీకే రాజు, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఈజీఎస్ ఏపీఓ కె.రామచంద్రరావు, కార్యదర్శులు సమ్మయ్య, రజిని, సందీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

‘సీతారామ’ నీటి కోసం రేపు ధర్నా

మణుగూరురూరల్: సీతమ్మసాగర్ సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని మండలాల్లో రేపు (శనివారం) నిర్వహించే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాలోని సీతారామ ఎత్తిపోతల పథకం సాగునీటిని జిల్లా రైతాంగానికి ఇవ్వకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు తరలించుకుపోవడం దుర్మార్గ చర్యన్నారు. ఖమ్మం జిల్లా రైతాంగానికి సాగునీరు అందించడం సంతోషకరమేనన్నారు. కానీ భద్రాద్రి జిల్లా రైతాంగాన్ని విస్మరించడం సరికాదన్నారు. వెంటనే జిల్లా రైతాంగానికి సీతారామ సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా ప్రధాన డిమాండ్లపై రేపు అన్ని మండలాల్లో ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని, ధర్నాల్లో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా ప్రకటనలో ఆయన పిలుపునిచ్చారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ తెల్లూరి శ్రీనివాసరావు

మణుగూరుటౌన్: రానున్న వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామస్థాయిలో పంచాయతీ, మున్సిపాలిటీ, వైద్య విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు తీర్మానించారు. గురువారం శివలింగాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం, గ్రామాల్లో హెల్త్ క్యాంపులు, శానిటేషన్ మెరుగుపర్చేందుకు ప్రత్యేక ప్రణాళికతో పాటు డ్రెయినేజీ, చెత్త నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టడంపై సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎంపీడీఓ తెల్లూరి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, వైద్యులు నిశాంత్ రావు, ఈఓఆర్డీ పల్నాటి వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూములు అప్పగించాలి



వినతిపత్రం అందిస్తున్న రామన్నగూడెం గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: అటవీ, ఎఫ్‌డీసీ ఆక్రమణలో ఉన్న గిరిజనుల భూములను సర్వే చేసి తిరిగి అప్పగించాలని కోరుతూ.. గురువారం స్థానిక రెవెన్యూ, అటవీ శాఖ, పోలీస్ శాఖ అధికారులకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతిపత్రాలను అందించారు. అనంతరం ఏఎస్‌పీ నాయకులు, గిరిజనులు మాట్లాడుతూ.. మండలంలోని రామన్నగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 30, 36, 39లకు సంబంధించి హైకోర్టు ఆదేశానుసారం తమ భూములను తిరిగి అప్పగించాలని కోరారు. హైకోర్టు, జిల్లా కలెక్టర్ ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే ఆయా భూములను ఈ నెల 8వ తేదీలోపు జాయింట్ సర్వే నిర్వహించి, పంచనామా జరిపించాలన్నారు. అలాగే గడువులోపు భూములను అప్పగించని పక్షంలో ఈ నెల 9వ తేదీ నుంచి స్థానిక తహసీల్దార్, ఫారెస్టు రేంజ్ కార్యాలయాల ఎదుట నిరావధిక నిరాహార దీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ జిల్లా కార్యదర్శి మడకం నాగేశ్వరరావు, మడకం స్వరూప, గ్రామస్తులు ఉన్నారు.

అర్హులకే ఇళ్లు ఇవ్వాలని ధర్నా



పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించిన మహిళలు

దుమ్ముగూడెం: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ యూత్ కమిటీ కోకన్వీనర్ వాగే కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామ మహిళలు బీఆర్ఎస్ పార్టీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు కేటాయించాల్సిన ఇందిరమ్మ ఇళ్లను కొందరు తమ రాజకీయ లబ్ధి కోసం స్వార్థపూరితంగా అనర్హులకు కేటాయించారని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు మడకం విజయలక్ష్మి, మట్ట పుష్ప, మట్ట లక్ష్మి, మట్ట రామకృష్ణ, మట్ట లింగమూర్తి, మట్ట వెంకటేష్, మట్ట ధర్మరాజు, తెల్లం వెంకటేష్, మడకం సాయికృష్ణ, బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

భవానీ మాత విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మణుగూరుటౌన్: సింగరేణి సివిల్ రైల్వే సైడింగ్ పరిసరాల్లోని ఆలయంలో భవానీ మాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం సివిల్ ధనసరి వెంకటేశ్వర్లు, కేసీహెచ్‌పీ డివైజీఎం మదన్‌నాయక్‌లు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి, విగ్రహ ప్రతిష్ఠకు సహకరించిన సివిల్ కేసీఓఎస్‌టీ అధికారులకు, కాంట్రాక్టర్లకు, సివిల్ సూపర్‌వైజర్లకు సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



అశ్వారావుపేటరూరల్: బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఫారెస్ట్ రేంజర్ మురళి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పలు రకాల మొక్కలను నాటారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి కాల్చివేశారు. అనంతరం రహదారులు, కూడళ్ల మీదుగా ర్యాలీలు నిర్వహించారు. మానవ హారం చేపట్టారు. ఇతర శాఖల అధికారులు, నాయకులు సైతం అటవీశాఖ వెంట నిలిచారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అందులో భాగంగా మొక్కలు నాటాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: లీగల్ సర్వీసెస్ మండల కమిటీ, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో..



గుండాల: మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు



భద్రాచలంటౌన్: రామాలయ భక్తులకు పర్యావరణ ఆవశ్యకతను వివరిస్తున్న ఆర్డీఓ దామోదరరావు



దుమ్ముగూడెం: మొక్క నాటిన జెడ్పీ సీఈఓ, పంచాయతీ కార్యదర్శులు



చంద్రుగొండ: అటవీశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



అశ్వాపురం: తుమ్మలచెరువులో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, ఎఫ్ఆర్ఓ, ఇతర అధికారులు



దమ్మపేట: మందలపల్లిలో మానవహారంగా ఏర్పడిన అటవీ అధికారులు, సిబ్బంది



కరకగూడెం: మొక్క నాటుతున్న అటవీ శాఖ అధికారులు

నకిలీలపై అప్రమత్తం

- కొనసాగుతున్న అవగాహన సదస్సులు
- విత్తనాల కొనుగోలుపై సలహాలు, సూచనలు
- రైతులు నష్టపోకుండా చర్యలు



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

భద్రాచలంటౌన్: భద్రాద్రి ఏజెన్సీలో వానాకాలం పంట సీజన్ నేపథంలో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాల విక్రయాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో విత్తనాల, ఎరువులు, పురుగు మందుల విక్రయంలో అక్రమాలు జరగకుండా, నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామల్లో అవగాహ సదస్సులు నిర్వహిస్తూ రైతులను అప్రమత్తం చేస్తున్నారు. నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించి సలహాలు, సూచనలు తెలియజేస్తున్నారు.

చర్యలు ముమ్మరం

భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా ఎక్కువగా రైతులు పత్తిని సాగు చేస్తారు. తరువాత స్థానంలో వరి, మిర్చి ఉంటాయి. పత్తి సుమారు 60 వేల ఎకరాలు, వరి సుమారు 40 వేల ఎకరాలు, మిర్చి సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. మరో పది వేల ఎకరాల్లో ఆరు తడి పంటలను వేస్తున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాల ఎంపికలో నాణ్యతను సరిచూసుకోవడం అవసరం. గతంలో కొందరు ఏపీకి చెందిన వ్యాపారులు వ్యవసాయ సీజన్ ముందుగానే గ్రామాల్లోని తమ అనుచరుల వద్ద నకిలీ విత్తనాలను నిలువ చేసేవారు. మామూలు విత్తనాల కంటే ధరలో చాలా వ్యత్యాసం ఉండడంతో గిరిజన రైతులు ఈ విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపేవారు. దీంతో పంట నష్టపోయిన ఘటనలు ఉన్నాయి. ఇటువంటి ఘటనలు జరగకుండా అధికారు ముందస్తు చర్యలో భాగంగా అధికారులు విత్తనాల విక్రయాల దుకాణాలను తనిఖీ చేయడంతో పాటు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తం చేయడమే లక్ష్యంగా..

రైతులను విత్తనాలు, ఎరువుల కొనుగోలు విషయంలో అప్రమత్తం చేయడమే లక్ష్యంగా అధికారులు గ్రామాల్లో పర్యటించి సూచనలు, సలహాలు తెలియజేస్తున్నారు. గుర్తుంపు పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, గ్రామాలకు వచ్చి విడిగా కిలోల్లో విక్రయించే వారిని నమ్మొద్దని చెబుతున్నారు. ప్రతి కొనుగోలు ప్యాకెట్‌పై అన్ని వివరాలు పరిశీలించడమే కాకుండా, విధిగా రసీదులు పొందాలని అధికారులు సూచిస్తున్నారు. రైతులు తమ వద్ద ఉన్న బిల్లుకు సంబంధించిన రసీదును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని తెలియజేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యానికి ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో సన్నాల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు సీడ్, మందుల విక్రయ దుకాణాలను ఏఈఓలు, ఏఓలు పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే విత్తనాలు పక్కదారి పట్టకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు.